## క్లుప్తంగా

### ఆపదలో 100కు డయల్ చేయాలి

**నిర్మల్‌టౌన్:** విద్యార్థినులు, మహిళలు ఆపదలో ఆందోళన చెందకుండా 100కు డయల్ చేయాలని పట్టణ ఎస్సై సుమలత పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు షీ టీం బృందం ఆధ్వర్యంలో బాల్యవివాహాలు ,బాల కార్మిక వ్యవస్థ, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్‌ఫ్రీ నెంబర్ 1930 వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

### ధైర్యంగా పరీక్షలు రాయాలి



భైంసా పాఠశాలలో విద్యార్థులతో రమేశ్

**భైంసారూరల్:** విద్యార్థులు ఆందోళన చెందకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు కొత్తిమీర రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని మహాగాం, కోతల్‌గాం, తిమ్మాపూర్, భైంసాలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులకు రూ.15వేల విలువైన పరీక్ష సామగ్రి పరీక్షప్యాడ్లు, పెన్నులు, స్కేళ్లు, చేతి గడియారాలను అందజేశారు. మహాగాం పాఠశాలలో రమేశ్‌ను ఘనంగా సత్కరించారు. ఆయా పాఠశాలల సిబ్బంది ఉన్నారు.

### బ్యాంకు సేవలపై అవగాహన

**లక్ష్మణచాంద:** మండల కేంద్రంలోని సహకార బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ శిరీష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏడీసీసీ బ్యాంకు, నాబార్డు సౌజన్యంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాలు, బీమా, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది చైతన్య, ఉదయ్, అజయ్, కళాకారులు రమేశ్, నారాయణ పాల్గొన్నారు.

### శుభ్రతపై దృష్టి సారించాలి

**ముధోల్:** గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించి స్వచ్ఛమైన వాతావరణం కల్పించాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం బాసర, ముధోల్ మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలకు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రిసోర్సు పర్సన్లు నవీన్, గంగాధర్ తడి, పొడి చెత్తతోపాటు మరుగుదొడ్లను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవోలు సురేశ్, నాగ్‌నాథ్, ఎంపీవో అమీర్‌ఖాన్ ఉన్నారు.

### పారిశుధ్య పనులు



పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

**ఖానాపూర్:** పట్టణంలోని శాంతినగర్ కాలనీ లో అపరిశుభ్రతను తెలుపుతూ 'పారిశుధ్యంపై పట్టింపేది' అనే శీర్షికన సోమవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బంది ని ఆదేశించారు. సిబ్బంది మురికి నీటిని తొలగించి క్లోరినేషన్ పనులు చేపట్టారు.

### ఎస్‌బీఎంపై అవగాహన

**తానూరు:** మండలంలోని కోలూరు రైతువేదికలో కార్యదర్శులు, అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీలకు సోమవారం ఎస్‌బీఎంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్(ఎస్‌బీఎం) ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ ఇస్తామన్నారు. రిసోర్స్‌పర్సన్ మధుమిత గ్రామాల్లో మరుగుదొడ్లు వినియోగించేలా చూడాలన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెరిగేందుకు సూచనలు చేశారు. ఎంపీవో మోహన్‌సింగ్ ఉన్నారు.

### ఎమ్మెల్యేకు ఆహ్వానం

**ఖానాపూర్:** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కుమ్మర ముల్లమాంబ విగ్రహావిష్కరణకు హాజరు కావాలని ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే రేఖానాయక్‌ను కోరారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి గంగాధర్, జిల్లా గౌరవ అధ్యక్షులు సురేశ్, సతీశ్, బుచ్చన్న ఉన్నారు.

### మంత్రి ఐకేరెడ్డికి ఆహ్వానం

**లక్ష్మణచాంద:** మండలంలోని చామన్‌పెల్లి రామాలయం వార్షికోత్సవానికి హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు మంత్రి ఐకేరెడ్డిని ఆహ్వానించారు. సోమవారం నిర్మల్‌లోని తన నివాసంలో వారిని కలిసి ఆహ్వానించగా సానుకూలంగా స్పందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సర్పంచ్ గంగాధర్, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నరేశ్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, గంగన్న, రమేశ్ ఉన్నారు.

# హరితహారానికి సన్నద్ధం

- నర్సరీల్లో సిద్ధమవుతున్న మొక్కలు
- మండలంలో లక్షా ఎనభై వేలు నాటడమే లక్ష్యం
- సంరక్షణలో నిమగ్నమైన సిబ్బంది



పొట్టపెల్లి నర్సరీలో సిద్ధమవుతున్న మొక్కలు

**లక్ష్మణచాంద:** తెలంగాణలో అడవుల శాతాన్ని పెంచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రతి పంచాయతీకో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

**18 నర్సరీల్లో పెంపకం..**

లక్ష్మణచాంద మండలంలో 18 పంచాయతీల పరిధిలో 23 గ్రామాలున్నాయి. పంచాయతీకో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఒక్కో నర్సరీలో 10 వేల మొక్కలలు.. మండలంలో లక్షా 80 వేల మొక్కలు పెంచాలని అధికారులు నిర్దేశించారు. ఎండకు ఎండిపోవడం, విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడం వంటి సమస్యలు తలెత్తకుండా ఒక్కో నర్సరీలో అదనంగా మరో వెయ్యి మొక్కలు పెంచుతున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీకి 11 వేల మొక్కల చొప్పున మొత్తం 18 పంచాయతీల్లో లక్షా 98 వేల మొక్కలను సిద్ధం చేస్తున్నారు.

**సంరక్షణ బాధ్యత సర్పంచ్, కార్యదర్శులదే..**

గతంలో మండలంలోని కొన్ని గ్రామపంచాయతీల్లోనే నర్సరీలు ఏర్పాటు చేసి.. మొక్కల పెంపకం చేపట్టి అక్కడి నుంచే అన్ని గ్రామాలకు సరఫరా చేసేవారు. కాని అప్పుడు ఆశించిన ఫలితాలు రాలేదు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకో నర్సరీని ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపట్టారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కల బాధ్యత సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల తోపాటు క్షేత్ర సహాయకులదేనని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే తమపై చర్యలు తీసుకుంటారనే భయంతో సర్పంచ్, కార్యదర్శి, క్షేత్ర సహాయకులు నర్సరీల్లోని మొక్కలను కంటికి రెప్పలా కాపాడుతున్నారు.

**గ్రీన్‌నెట్‌లు ఏర్పాటు..**

రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండటంతో నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా అధికారులు గ్రీన్ నెట్‌లు ఏర్పాటు చేసి సంరక్షిస్తున్నారు. అలాగే నిత్యం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలు మొక్కలకు నీళ్లు అందిస్తూ సంరక్షిస్తున్నారు. గతంలో మాదిరి కాకుండా ఈసారి ప్రజలకు ఇష్టమైన పూలు, పండ్ల మొక్కలు అందిస్తామని ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.

**11 వేల మొక్కలు పెంచుతున్నాం**



మా గ్రామంలోని నర్సరీకి 11 వేల మొక్కల టార్గెట్ పెట్టుకుని పెంచుతున్నాం. ఎండకు ఎండిపోకుండా గ్రీన్ నెట్‌లను ఏర్పాటు చేశాం. మొక్కల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– రాజేందర్, సర్పంచ్, పార్‌పెల్లి

**ప్రజల అభిరుచి మేరకే**



గతంలో మాదిరి కాకుండా ప్రజల అభిరుచి మేరకు వారు అడిగిన పండ్లు, పూల మొక్కలు, నీడనిచ్చే మొక్కల తోపాటు అలంకరణ మొక్కలను సైతం నర్సరీలో పెంచుతున్నాం.

– లత, సర్పంచ్, పీచర

**సిద్ధం చేస్తున్నాం**



తొమ్మిదో విడత హరితహారం కోసం మండలంలోని 18 నర్సరీల్లో ఒక్కో నర్సరీకి 11 వేల మొక్కల చొప్పున మొత్తం మండలంలో లక్షా 98 వేల మొక్కలు సిద్ధం చేస్తున్నాము. అలాగే మొక్కల సంరక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నాం.

– ప్రమీల, ఏపీవో, లక్ష్మణచాంద

# బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

**నిర్మల్‌టౌన్:** బాధితులు భయపడకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించడమే తమ లక్ష్యమని.. అనుమానాస్పద వ్యక్తులు, సంఘ విద్రోహ శక్తుల సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లా వాట్సాప్ నంబర్ 8712659599కు సమాచారం తెలియజేయాలని సూచించారు.

# రసాభాసగా ప్రజావేదిక

- గ్రామాల్లో వెలుగుచూస్తున్న అక్రమాలు
- చనిపోయినవారు, దుబాయ్ వెళ్లిన వారి పేరిట కూలి చెల్లింపు



ప్రజావేదికలో ఎర్వచింతల్ కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

**ఖానాపూర్:** పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన ఉపాధిహామీ ప్రజావేదిక రసాభాసగా సాగింది. డీఆర్డీవో విజయలక్ష్మితోపాటు ఎస్ఎంటీ దత్తు, హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్ హాజరయ్యారు. మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో 2019 నుంచి మార్చి 2022 వరకు రూ.17.75 కోట్లతో ఉపాధి పనులు జరిగినట్లు అధికారులు తెలిపారు. పలు గ్రామాల్లో చనిపోయిన వారు, దుబాయ్ వెళ్లిన వారి పేర్లపై, ప్రభుత్వ సంస్థల్లో పని చేసే అంగన్‌వాడీ హెల్పర్, పంచాయతీ వర్కర్లు, ఆశావర్కర్ల పేర్లపై కూలి డబ్బులు చెల్లించినట్లు బీఆర్‌పీలు ప్రజావేదికలో వెల్లడించారు. కందకాల తవ్వకాల్లో తేడాల కారణంగా రూ.లక్షలు అదనంగా చెల్లించారని, పలు గ్రామాల్లో కూలీల నుంచి మేట్‌లు వారానికి రూ.వంద చొప్పున వసూలు చేసి కార్యదర్శులు, టీఏలకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో విజయలక్ష్మి అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. పనుల్లో వెలుగు చూసిన అవినీతి, అక్రమాల నిలదీతల మధ్య ప్రజావేదిక సాగింది. అధికారులు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయకపోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎస్సై శంకర్ అక్కడికి చేరుకొని సముదాయించడంతో ఆందోళన సద్దుమణిగింది. మండలంలోని బీర్నంది, కోలంగూడ, ఎర్వచింతల్, ఎక్బాల్‌పూర్, కోలంగూడ, కొత్తపేట, బావాపూర్(ఆర్), రాజు, దాసునాయక్‌తండా, బిల్యానాయక్‌తండా, సుర్జాపూర్, బాదన్‌కుర్తి తదితర గ్రామాల్లో పనులపై రాత్రివరకు సభ జరిగింది. ఎంపీపీ మోహిద్, వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, ఎంపీడీవోలు మల్లేశ్,వనజ, ఎస్ఆర్‌పీలు మహేశ్, రాఘవ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

# బాలికలకు రక్తహీనత పరీక్షలు



నర్సాపూర్(జి)లో వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం

**లక్ష్మణచాంద:** మండల కేంద్రంలో కిశోర బాలికలకు సోమవారం రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. పోషణ పక్వాడలో భాగంగా సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది రక్తహీనత పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. వైద్య సిబ్బంది చంద్ర, సుగుణ, అంగన్‌వాడీ టీచర్ పద్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

**నర్సాపూర్(జి):** పోషణ్ పక్వాడలో భాగంగా మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో ఏఎన్ఎం సౌందర్య కిశోర బాలికలు, మహిళలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు, సామలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. అంగన్వాడీ టీచర్ గంగామణి, రాధ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

**సారంగపూర్:** అడెల్లి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తారనే సమాచారంతో సోమవారం తెల్లవారు జామున పలువురు బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు కరిపె విలాస్ మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం అడెల్లి ఆలయ అభివృద్ధి పేరిట గర్భగుడిలోని అమ్మవారిని తొలగించి వేరే చోట బాలాలయం ఏర్పాటు చేయడం ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించడమేనని అన్నారు. గర్భగుడిలో అమ్మవారి విగ్రహం అలాగే ఉంచాలని గ్రామస్తులు కోరినా వారి మాట వినకుండా మంత్రి ఐకేరెడ్డి పనులను ప్రారంభించడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. అరెస్టయిన వారిలో బీజేపీ నాయకులు వెంకటేశ్, చాణక్య, తేజు, తిరుమలచారి, అఖిల్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ నాయకుల నిరసన



సారంగపూర్‌లో మంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కడెంలో మాట్లాడుతున్న వినోద్‌నాయక్

**నర్సాపూర్(జి):** ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడం, రాహుల్ గాంధీ ఎంపీ పదవిపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ సోమవారం నర్సాపూర్(జి)లో కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, రాంపూర్ సర్పంచ్ గోవిందరెడ్డి, సాయన్న, ప్రవీణ్‌పటేల్, లక్ష్మణ్, గణేశ్ పటేల్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సారంగపూర్:** ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో నిర్మల్–స్వర్ణ ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మంత్రి ఐకేరెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. గ్రూప్–1 పరీక్ష పేపర్ లీకేజీ సాధారణమని మాట్లాడిన మంత్రిపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. నిరసనలో నాయకులు చందు, దశరథ రాజేశ్వర్, పోతన్న, సామల వీరయ్య, సాహెబ్‌రావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మణచాంద:** కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని నిర్మల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సరికెల గంగన్న డిమాండ్ చేశారు. నిర్మల్ మున్సిపాలిటీలో ఉద్యోగాల భర్తీలో జరిగిన అవకతవకలపై ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి నిరుద్యోగుల తరఫున ప్రశ్నించినందుకు నోటీసులు జారీ చేయడంపై సోన్‌లో నిరసన తెలిపారు. లక్ష్మణచాందలో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. లక్ష్మణచాందలో యూత్ మండలాధ్యక్షుడు చిన్నయ్య, మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు చిన్నయ్య, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీలు నర్సారెడ్డి, రాజేశ్వర్, సోన్‌లో హరీశ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మార గంగారెడ్డి, సిద్దిలకుంట సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, న్యూవెల్మల్ ఎంపీటీసీ నాగయ్య, సాయినాథ్, హైమద్, నర్సయ్య పాల్గొన్నారు.

**పెంబి:** రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గంగాభవాని ఆధ్వర్యంలో సోమవారం పెంబి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్‌రెడ్డి, స్వామి తదితరులున్నారు.

**కడెం:** ప్రజా వ్యతిరేక, అహంకార పూరిత పాలన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలని ఏఐసీసీ రిసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ అన్నారు. కడెంలోని హరిత రిసార్ట్స్‌లో మాట్లాడారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం, మహేశ్వరరెడ్డిపై అక్రమ కేసు నమోదు అహంకారానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, రఫీక్, మల్లేశ్, బబ్లూ, సలీం, యాదగిరి, రాజన్న, తదితరులు ఉన్నారు.

# సమ్మె నోటీసు ఇచ్చిన వీవోఏలు



తానూరులో నోటీసు అందిస్తున్న వీవోఏలు



లక్ష్మణచాందలో..

**తానూరు:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తానూరు ఐకేపీ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల వీవోఏలు డ్వాక్రా సంఘం మండలాధ్యక్షులు మంగళ, ఐకేపీ ఏపీఎం నారాయణ్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పని చేస్తున్న వీవోఏలకు ఉద్యోగ భద్రత, నెలకు రూ.26 వేలు, రూ.10 లక్షల బీమా కల్పించాలని కోరారు. అర్హులైన వీవోఏలకు సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మోహన్, కార్యదర్శి శివరాం, కోశాధికారి దిలీప్, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మణచాంద:** మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో డీపీఎం జ్ఞానుకు మండలంలోని ఆయా గ్రామాల వీవోఏలు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నుంచి సమ్మె చేపడుతున్నామని.. ఎటువంటి పనులు చేయబోమని స్పష్టం చేశారు. వీవోఏల సంఘం మండలాధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి నవీన్, కోశాధికారి లావణ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**కుంటాల:** తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఆయా గ్రామాల వీవోఏలు కుంటాలలో ఏపీఎం భోజన్నకు సమ్మె నోటీసు అందజేశారు. వీవోఏల సంఘం మండలాధ్యక్షుడు మహేశ్, కార్యదర్శి గజ్జారం, రాంశంకర్ తదితరులు ఉన్నారు.

**లోకేశ్వరం:** మండలంలోని వీవోఏలు లోకేశ్వరం ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం మల్లేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంగీత, గంగాధర్, గంగన్న, సునీత తదితరులు ఉన్నారు.

**సారంగపూర్:** మండల కేంద్రంలో ఐకేపీ ఏపీఎం మాధురికి మండలంలోని ఆయా గ్రామాల వీవోఏలు సమ్మె నోటీసు అందజేశారు. వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు శోభ, వీఓఏలు, సీసీలు, తదితరులు ఉన్నారు.

**ముధోల్:** తమ సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీవోఏలు సోమవారం సమ్మె బాట పట్టారు. వీవోఏల సంఘం పిలుపు మేరకు ముధోల్‌లో ఏపీఎం గురుచరణ్‌కు ముధోల్, బాసర మండలాల వీవోఏలు సమ్మె నోటీసు అందించారు.

**పెంబి:** తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఐకేపీ వీవోఏలు మండలకేంద్రంలో ఏపీఎం గంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం మండలాధ్యక్షుడు స్వప్న, వీఓఏలు చెవ్వ రమేశ్, సిరిపెల్లి రమేశ్, స్వప్న తదితరులు ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కుంటాల:** భైంసా 132/కేవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు నుంచి ఉదయం 10 గంటల వరకు లింబా(బి), లింబా(కే), ఓలా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామ ని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

**రేపు మండల సర్వసభ్య సమావేశం**

**లోకేశ్వరం:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో సల్మాన్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు, పాలకులు హాజరవాలని కోరారు.

**నేడు దివ్యాంగుల బస్‌పాస్ మేళా**

**భైంసారూరల్:** భైంసా మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం దివ్యాంగుల బస్సు పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మేళా ఉంటుందన్నారు. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్, పాస్‌ఫొటో, రూ.50 తీసుకొని రావాలని సూచించారు.

### కలెక్టరేట్ ఎదుట దీక్ష

**నిర్మల్‌చైన్‌గేట్:** గ్రామాల్లో వీడీసీల పెత్తనం, అగ్రకులాల ఆధిపత్యం అరికట్టా లని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. లోకేశ్వరం మండలం కనకాపూర్‌లోని దళిత రైతు కొబ్బానోల్ల గంగన్నకు చెందిన ఐదు ఎకరాల పట్టా భూమిని కబ్జా చేసిన అదే మండలంలోని అబ్దుల్లాపూర్ సర్పంచ్ రమణారెడ్డి, వీడీసీ సభ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ దళిత రైతు భూమిని వీడీసీ వారు కబ్జా చేసి క్రికెట్ గ్రౌండ్‌గా మార్చారన్నారు. లోకేశ్వరం తహసీల్దార్, ఎస్సై సైతం డబ్బులు తీసుకొని దళిత రైతుకు అన్యాయం చేశారన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని దళిత రైతుకు న్యాయం చేయాలని కోరారు. పలువురు నాయకులు వచ్చి సంఘీభావం తెలిపారు.

### సద్వినియోగం చేసుకోవాలి

**భైంసాటౌన్:** ఆన్‌లైన్ ద్వారా అందించే ఈ స్టాంపింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు శ్రీనివాస్ అన్నారు. భైంసాలో సోమవారం స్టాంప్ ఫ్రాంకింగ్ సేవలను భైంసా సబ్ రిజిస్ట్రార్ రవికాంత్ ప్రారంభించారు. రూ.వంద, ఆపైన స్టాంపులు, డీడ్‌లు, డాక్యుమెంట్ బాండ్‌ల కోసం ఫ్రాంకింగ్ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

## ఆధ్యాత్మికం

### ఉమామహేశ్వర ఆలయ వార్షికోత్సవం



కుంటాలలో పూజలు చేస్తున్న భక్తులు

**కుంటాల:** మండల కేంద్రంలోని శ్రీ ఉమామహేశ్వర ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉమామహేశ్వర, గణపతి, కాలభైరవ, అన్నపూర్ణ, అయ్యప్ప స్వామి ప్రతిమలకు గోదావరి జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని అలంకరించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం అందించారు.

**భీమయ్య విగ్రహ ప్రతిష్ఠాపన**

**భైంసా:** బాసరలో భీమయ్య దేవుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ కార్యక్రమం పూర్తి చేశారు. అనతరం భక్తులకు అన్నదానం చేశారు.

**ఘనంగా హవన హోమం**

**ఖానాపూర్:** మండలంలోని సుర్జాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాన్యుసుక్త పారాయణ పూర్వక హవన హోమ యజ్ఞం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు చక్రపాణి నర్సింహమూర్తి, అర్చకులు కోటపల్లి అనిశ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. గ్రీన్‌ఇండియా చాలెంజ్ డైరెక్టర్ బాదావత్ పూర్ణచందర్‌నాయక్, తదితరులు పూజలు చేశారు.

**కొనసాగుతున్న సప్తాహం**

**భైంసారూరల్:** మండలంలోని కామోల్ సీతారామచంద్రస్వామి ఆలయంలో సప్తాహం కార్యక్రమం కొనసాగుతుంది. భక్తులు తరలివస్తుండటంతో ప్రతిరోజు ఉదయం సంకీర్తన, భజనలు, సాయంత్రం కీర్తనలు ఆలపిస్తున్నారు.

**పూజలు**

**భైంసారూరల్:** మండలంలోని వాలేగాం గ్రామ హనుమాన్ ఆలయంలో సోమవారం హనుమాన్ దీక్షాపరులు ప్రత్యేక పూజలు చేశారు.

**30న సీతారాముల కల్యాణం**

**కుంటాల:** మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో ఈనెల 30న శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:57 నుంచి మధ్యాహ్నం 12:35 నిమిషాలకు నిర్వహించే కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

**ఇఫ్తార్‌విందు**

**లక్ష్మణచాంద:** మండలంలోని కాశీగూడలో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు నిర్వహించారు. సోమవారం మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) పంచాయతీలోని కాశీగూడలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.